సాక్షి
వికారాబాద్

బుధవారం । 11 । సెప్టెంబర్ । 2024



సందేహాలే సర్వం!

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రుణమాఫీపై అన్నదాతల్లో నెలకొన్న సందేహాలు తీరడం లేదు. 8లో ▸



ఎగతాళి చేస్తున్నారని..

తనను జైలు పాలు చేశారనే మనస్తాపానికి గురైన ఓ మహిళ ఆత్మహత్యకు యత్నించింది. చికిత్స పొందుతూ మరణించింది. 8లో ▸



ఆఫీసర్లు లేక..

దౌల్తాబాద్‌లో అధికారులు లేకపోవడంతో పాలన గాడి తప్పుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. 9లో ▸



పెద్దేముల్: తింసాన్‌పల్లిలో గణపయ్యకు పూజలు చేస్తున్న భక్తులు

❖ నీరాజనం

గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామివారు భక్తుల నీరాజనాలు అందుకుంటున్నారు. మండపాల నిర్వాహకులు రోజుకో నైవేద్యం సమర్పిస్తున్నారు. వీధుల్లో కొలువుదీరిన గణనాథులను తిలకించడానికి భక్తులు తరలివస్తున్నారు. మండపాల వద్ద ప్రత్యేక కార్యక్రమాలు, భజనలు, భక్తి పాటలు ఆలపిస్తున్నారు. నిమజ్జనానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

❖ నివాళి

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు.. వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని మంగళవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, నేతలు, అధికారులు ఆమె పోరాటాన్ని స్మరించుకున్నారు. ఐలమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రతి ఒక్కరూ ఆమె స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.



పరిగి: చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తదితరులు



పరిగి: రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

❖ నిరసన

పాఠశాలకు వెళ్లే సమయంలో ఆర్టీసీ బస్సులు రావడం లేదంటూ విద్యార్థులు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. పరిగి మండలం గడిసింగాపూర్‌లోని హైదరాబాద్ – బీజాపూర్ ప్రధాన రహదారిపై మంగళవారం పలు గ్రామాల విద్యార్థులు ఆందోళన చేపట్టారు. బుద్లాపూర్, కిష్టాపూర్ తదితర గ్రామాలకు బస్సు సౌకర్యం లేక అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

రేపు వికారాబాద్ ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్‌తో ఫోన్ ఇన్

గ్రామాలు, పట్టణాల్లో విషజ్వరాలు, డెంగీ, చికున్‌గున్యా తదితర సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఆస్పత్రులకు బాధితులు క్యూ కడుతున్నారు. ఈ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలపై ఫోన్ ఇన్ ద్వారా వికారాబాద్ ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ సలహాలు, సూచనలు ఇస్తారు.





అంశం: విషజ్వరాలు, డెంగీ, చికున్‌గున్యా తదితర సీజనల్ వ్యాధులు

డాక్టర్: సి.రాంచంద్రయ్య

వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి

తేదీ: 12 - 09 - 2024 (గురువారం)

సమయం: ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్:

92471 59378

పాఠశాలలు మెరుగవ్వాలి

- కలెక్టర్ ప్రతీక్ జైన్
- పారిశుద్ధ్య నిర్వహణపై మహిళా సమాఖ్య సభ్యులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, ఇందుకోసం నిధులు విడుదలైనట్లు కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని స్త్రీ శక్తి భవన్‌లో జిల్లా మహిళా సమాఖ్య సభ్యులు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో పారిశుద్ధ్య పనులు, అమ్మ ఆదర్శ పనుల పురోగతి, ధాన్యం కమీషన్ చెల్లింపులపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల నిర్వహణ మెరుగ్గా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పారిశుద్ధ్య పనులకు నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఇందుకు సంబంధించిన బాధ్యతలను అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలకు అప్పగించడం జరిగిందన్నారు. పాఠశాలల కమిటీలు, ప్రధానోపాధ్యాయులను సమన్వయం చేసుకుంటూ మహిళా సంఘాలు స్కూళ్ల నిర్వహణ బాధ్యతలు తీసుకోవాలని సూచించారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను బట్టి నెలకు రూ.3 వేల నుంచి రూ.20 వేల వరకు నిర్వహణ ఖర్చులు చెల్లించనున్నట్లు తెలిపారు. అమ్మ ఆదర్శ పనులు పూర్తయిన వెంటనే చెల్లింపులు చేయనున్నట్లు పేర్కొన్నారు. మహిళా సంఘాలకు 2021 రబీ నుంచి ఐదు సీజన్ల వరకు రావాల్సిన ధాన్యం కమీషన్ మంజూరైనట్లు వివరించారు. రూ.2 కోట్ల 47 లక్షలు సంఘాలకు చెల్లించడం జరుగుతుందన్నారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించనున్నట్లు చెప్పారు. ఆసక్తిగల మహిళలు ముందుకు రావాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌డీఓ శ్రీనివాస్, ఏపీడీ సరోజ, డీపీఎం రామమూర్తి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అలవేలు, వివిధ మండలాల సంఘం అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు అందజేయండి

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లుల పరిశీలన పూర్తి చేసి సమర్పించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ ప్రత్యేక అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అమ్మ ఆదర్శ పనుల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలల కింద 924 స్కూళ్లను ఎంపిక చేయడం జరిగిందన్నారు. వీటిలో చేపట్టిన చాలా పనులకు చెల్లింపులు చేసినట్లు తెలిపారు. భవన మరమ్మతులు, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల నిర్మాణానికి సంబంధించిన పనుల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. ఈ ప్రక్రియను పూర్తి చేస్తే బిల్లులు చెల్లించే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, డీఆర్‌డీఓ శ్రీనివాస్, డీఈఓ రేణుకాదేవి, అమ్మ ఆదర్శ పాఠశాల ప్రత్యేక అధికారులు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.



కోకట్ కాగ్నా నది వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి తదితరులు

నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

- ఎస్పీ నారాయణరెడ్డి
- కోకట్ కాగ్నా నది వద్ద ఏర్పాట్ల పరిశీలన

యాలాల: జిల్లాలో వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని కోకట్ కాగ్నా నది వద్ద నిమజ్జన ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేడు (బుధవారం) కాగ్నా బ్రిడ్జి వద్ద విగ్రహాలను నిమజ్జనం చేస్తారని తెలిపారు. తాండూరు తోపాటు పరిసర గ్రామాల నుంచి భారీ సంఖ్యలో విగ్రహాలను తెస్తారని తెలిపారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి ప్రమాదాలు, అపశ్రుతులు చోటుచేసుకోకుండా పోలీసు శాఖ అన్ని చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. బ్రిడ్జికి ఇరువైపులా బారికేడ్లు, లైటింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కాగ్నా బ్రిడ్జి వద్ద తాండూరు మున్సిపల్, కోకట్ పంచాయతీ సిబ్బంది, ట్రాన్స్‌కో అధికారులు చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ స్వప్న, డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, పట్టణ సీఐ సంతోష్ కుమార్, ఎస్ఐ శంకర్, హిందూ ఉత్సవ సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

స్వగ్రామంలో ‘కాలకేయుడి’ సందడి



కుటుంబ సభ్యులతో కలిసి వినాయకుడిని దర్శించుకుంటున్న సినీ నటుడు ప్రభాకర్

దుద్యాల్: బాహుబలి చిత్రం ప్రతినాయకుడు.. కాలకేయుడి పాత్ర పోషించిన ప్రభాకర్ కుటుంబ సభ్యులతో కలిసి సొంత గ్రామమైన దుద్యాల్ మండలం హస్నాబాద్‌లో సందడి చేశారు. గాంధీ చౌక్ వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడిని మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో తాను చదువుకునే రోజుల్లో వినాయక చవితి పండుగ వచ్చిందంటే తోటి స్నేహితులతో కలిసి సందడి చేసేవారమని తెలిపారు. పదకొండు రోజుల పాటు ఎంతో భక్తిశ్రద్ధలతో పూజలు చేసే వారమని గుర్తు చేసుకున్నారు. యువత భక్తి మార్గంలో నడవాలని సూచించారు.

పంట వివరాల నమోదు తప్పనిసరి

జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి



పంట వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న మోహన్‌రెడ్డి

యాలాల: రైతులు తమ పంట వివరాలను ఏఈఓల ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని రసూల్‌పూర్ శివారులో సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంట వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటే ప్రభుత్వం వద్ద పక్కా సమాచారం ఉంటుందని తెలిపారు. పథకాల అమలు, పంటలు నష్టపోయినప్పుడు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.



కడా కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులతో మాట్లాడుతున్న పోలీసులు

గురుకులాన్ని తరలించొద్దు


- విద్యార్థి సంఘం నాయకుల డిమాండ్
- కడా కార్యాలయం ఎదుట నిరసన

కొడంగల్ రూరల్: దౌల్తాబాద్ మండలం నీటూర్ గ్రామానికి మంజూరైన గురుకుల విద్యాలయాన్ని మరో ప్రాంతానికి తరలించే ప్రయత్నాలను విరమించుకోవాలని విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా, కడా కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా విద్యకు దూరమవుతున్న ఆదివాసీ పరిస్థితులను పోలి ఉన్న నీటూర్, నర్సాపూర్, కొడీడ్ గ్రామాల ప్రజలు కోసం ఇటీవల ప్రభుత్వం గురుకులాన్ని మంజూరు చేసిందని తెలిపారు. ఇంతలోనే దాన్ని తరలించేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు. విద్యాలయాన్ని తరలించే కుట్రలను మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు మహేష్, రాఘవేందర్, నరేష్, పరమేష్, జీవిద్, రవి, చాన్ పాషా, కృష్ణ, శ్రీకాంత్, మాజీ ఎంపీటీసీ నల్ల నర్సింలు, మాజీ సర్పంచ్ వెంకటయ్య, వార్డు మాజీ మెంబర్ వెంకటేష్ పాల్గొన్నారు.

13న అవిశ్వాస బలపరీక్ష

- క్యాంపునకు తరలిన పెద్ద అంబర్‌పేట కౌన్సిలర్లు

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీకి చెందిన 17మంది కౌన్సిలర్లు క్యాంపునకు తరలివెళ్లారు. ప్రస్తుత చైర్‌పర్సన్‌కు చెవుల స్వప్నకు వ్యతిరేకంగా కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం అందజేశారు. ఇది పరిగణలోకి తీసుకున్న కలెక్టర్ శశాంక 13న అవిశ్వాస బలపరీక్షకు సమావేశాన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కౌన్సిలర్లకు నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. చైర్‌పర్సన్ రేసులో ఉన్న పండుగల జయశ్రీ రాజు ఇప్పటికే రెండు సార్లు విఫలయత్నం చేశారు. మూడోసారి ఎలాగైనా మున్సిపల్ పీఠం దక్కించుకునేందుకు ఆమె పట్టుతో ఉన్నారు. ప్రస్తుతం చైర్‌పర్సన్‌గా ఉన్న స్వప్న తీరుపై పార్టీలకు అతీతంగా మెజార్టీ కౌన్సిలర్లు అసంతృప్తిగా ఉన్నారనే చర్చలున్నాయి. ఈ క్రమంలోనే స్వప్నను ఎలాగైనా పదవి నుంచి దింపి ఆమె స్థానంలో జయశ్రీని చైర్‌పర్సన్‌గా ఎన్నుకునేందుకు స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారని ఆయా పార్టీల నేతలు చర్చించుకుంటున్నారు. క్యాంపునకు తరలిన కౌన్సిలర్లు సమావేశానికి నేరు హాజరవుతారని సమాచారం.



ఆ ముగ్గురు హాజరవుతారా..?

ప్రస్తుతం చైర్‌పర్సన్ స్వప్నకు ముగ్గురు కౌన్సిలర్లు మాత్రమే మద్దతుగా నిలుస్తున్నట్లు తెలుస్తోంది. వైస్ చైర్ పర్సన్ చామ సంపూర్ణవిజయశేఖర్‌రెడ్డితో పాటు కల్వంచకు చెందిన ఇద్దరు కౌన్సిలర్లు సమావేశానికి హాజరు కాకుండా జయశ్రీకి పరోక్షంగా మద్దతు ప్రకటించే అవకాశాలున్నాయని చర్చించుకుంటున్నారు.

బీజేపీకి కార్యకర్తలే బలం

- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు
- వికారాబాద్‌లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఎంపీ రఘునందన్‌రావు తదితరులు

అనంతగిరి: బీజేపీకి కార్యకర్తలే కొండంత బలమని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. మంగళవారం వికారాబాద్‌లోని ఎన్‌టీఆర్ చౌరస్తాలో పార్టీ జిల్లాస్థాయి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశం కోసం, ధర్మం కోసం పాటుపడేది బీజేపీ ఒక్కటేనని పేర్కొన్నారు. సాధారణ కార్యకర్త సైతం ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశం కమలం పార్టీలోనే ఉందన్నారు. ప్రతి కార్యకర్తా సభ్యత్వ నమోదులో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో అధికార పార్టీకి ఎన్ని ఎంపీ స్థానాలు వచ్చాయో బీజేపీకి కూడా అన్నే స్థానాలు వచ్చాయని గుర్తుచేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామగ్రామాన సత్తా చాటాలని కార్యకర్తలకు సూచించారు. అందుకు ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఎంతో దోహదం చేస్తుందన్నారు. గతంలో జిల్లా అభివృద్ధి గురించి పలువురు నాయకులు ఎన్నో చెప్పారని, ఆచరణలో మాత్రం సాధ్యం కాలేదని ఆరోపించారు. నేను ఎవరికీ వత్తాసు పలకనని, దేశం కోసం, ధర్మం కోసం మాట్లాడతానని అన్నారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్న ప్రధాని మోదీ గురించి దేశ విచ్ఛిన్నాన్ని కోరుకునే వ్యక్తి రాసిచ్చిన స్క్రిప్ట్‌ను రాహుల్ గాంధీ చదువుతున్నారని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీకి పెళ్లయ్యిందని ఓ పత్రికలో ప్రచురితమైతే తల్లి సోనియాగాంధీ సైతం ఖండించలేదని అన్నారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు బీజేపీ గెలిస్తేనే దేశం బలంగా, క్షేమంగా ఉంటుందన్నారు. ఇందుకోసం ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివరాజు, సదానందరెడ్డి, నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్ల నందు, ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకుడు నవీన్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు నరోత్తంరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి,నాయకులు బుస్స శ్రీకాంత్, యాస్కి శిరీష, పోకల సతీష్, కేపీ రాజు, పాండుగౌడ్, నందు, డాక్టర్ రాజశేఖర్, చరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనంతుని సేవలో..

అనంతరం రఘునందన్‌రావు అనంతగిరి గుట్టలోని శ్రీ అనంతపద్మనాభ స్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మొక్కు తీర్చుకున్నారు. అనంతరం వేదపండితుల తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వంటగది నిర్వహణ ఇలాగేనా?

- సిబ్బందిపై సబ్ కలెక్టర్ ఆగ్రహం
- విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశం

తాండూరు రూరల్: విధుల్లో చేరిన నాలుగు రోజుల్లోనే సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ పాలన పరంగా తనదైన ముద్ర వేస్తున్నారు. మంగళవారం మండలంలోని కరన్‌కోట్ జెడ్పీహెచ్‌ఎస్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గంటన్నర పాటు పాఠశాలలో కలియ తిరిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు వంట గదిని పరిశీలించారు. వంటకు వినియోగించే వస్తువులు, సరుకులు, గది అపరిశుభ్రంగా ఉండటంతో అసహనం వ్యక్తం చేశారు. సరుకులను ఇష్టానుసారంగా పడేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గదిని పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని హెచ్‌ఎంకు సూచించారు. అనంతరం ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు.

పాఠాలు బోధించిన సబ్‌కలెక్టర్

పాఠశాలలోని 9వ తరగతి విద్యార్థులకు సబ్ కలెక్టర్ పాఠాలు బోధించారు. భౌతికశాస్త్రానికి సంబంధించి పలు ప్రశ్నలు వేశారు. కష్టపడి చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఆయన వెంట సీనియర్ అసిస్టెంట్ మాణిక్‌రావు, ఎంపీఓ ఆనంద్‌రావు, ఇన్‌చార్జ్ హెచ్‌ఎంలు ఉన్నారు.



కరన్‌కోట్ జెడ్పీహెచ్‌ఎస్‌లో వంటగదిని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్

క్లుప్తంగా

పాంబండ దేవస్థానానికి రండి



ఎంపీ రఘునందన్‌రావును కలిసిన బీజేపీ నేతలు

కుల్కచర్ల: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న దేవాలయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు వచ్చేందుకు కృషి చేయాలని బీజేపీ కుల్కచర్ల మండల నేతలు మెదక్ ఎంపీ రఘునందన్‌రావును కోరారు. మంగళవారం జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం బండవెల్కిచర్ల గ్రామ పరిధిలో ఉన్న శ్రీ పాంబండ రామలింగేశ్వర దేవస్థానానికి వచ్చి ప్రత్యేకపూజలు నిర్వహించడంతో పాటుగా ఆలయాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సురేశ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు మైపాల్, బీసీ మోర్చా జిల్లా కార్యదర్శి చంద్రలింగం, నాయకులు భీమయ్య, రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సాయుధ వారోత్సవాలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి బషీర్

కొడంగల్ రూరల్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఇందనూర్ బషీర్ పిలుపునిచ్చారు. ఈ నెల 11వ తేదీ నుంచి 17 వరకు వారోత్సవాలను రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ తరఫున చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. వారం రోజులపాటు నిర్వహించే సాయుధ పోరాట వారోత్సవాలను గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా కార్యవర్గ సభ్యులు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఎండీ మహ్మద్, పార్టీ కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

పెద్దేముల్ రైల్వే లైన్‌కు సహకరించండి

కాంగ్రెస్ రాష్ట్ర మైనార్టీ సెల్ కన్వీనర్ రియాజ్



ఎంపీకి వినతిపత్రం అందచేస్తున్న రియాజ్

పెద్దేముల్: తాండూరు–జహీరాబాద్ కొత్త రైల్వే లైన్‌ను పెద్దేముల్ మీదుగా ఏర్పాటు చేయాలని బీదర్ ఎంపీ(కర్ణాటక) సాగర్ ఖంద్రేకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ కన్వీనర్ రియాజ్ మంగళవారం వినతిపత్రం అందచేశారు. వారితో పాటు కర్ణాటక కేపీసీసీ ఉపాధ్యక్షుడు సుభాష్ రాథోడ్, మాజీ తాలుక పంచాయతీ సభ్యుడు వెంకటయ్య తదితరులు ఉన్నారు. జహీరాబాద్, బీదర్ వెళ్లాలంటే వికారాబాద్ నుంచి వెళ్లాల్సి వస్తుందని, కొత్త రైల్వే లైన్ ఏర్పాటు చేయడంతో పెద్దేముల్, తాండూరు, యాలాల మండల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జనార్దన్, నర్సింలు, చిరంజీవి, బిచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

పోలీసులపై మందుబాబు వీరంగం

ధారూరు: కోట్‌పల్లి ప్రాజెక్టు వద్ద మద్యం తాగి హల్‌చల్ చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా కేశంపేట్ మండలానికి చెందిన శివకుమార్ ఆదివారం ప్రాజెక్టు సమీపంలో మద్యం తాగుతున్నాడు. అతడిని పోలీసులు అడ్డుకొని బహిరంగంగా తాగొద్దని హెచ్చరించారు. కానీ శివకుమార్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడి, అనుచిత వ్యాఖ్యలు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. మంగళవారం జడ్జి ఒక రోజు జైలు శిక్ష విధించారు.

సందేహాలే సర్వం!



మోమిన్‌పేటలోని యూనియన్ బ్యాంకులో రుణ వివరాలు తెలుసుకొంటున్న రైతులు

పంట రుణాల మాఫీపై స్పష్టత కరువు

- రూ.2 లక్షలకు పైన రుణమున్న రైతుల్లో ఆందోళన
- అధిక వడ్డీలకు తెచ్చి చెల్లిస్తున్నామని గగ్గోలు
- ప్రభుత్వం స్పందించాలని వినతులు

రైతు రుణమాఫీలో ఎదురవుతున్న సందేహాలను నివృత్తి చేసే పరిస్థితి లేకుండా పోయింది. పలు విషయాల్లో ప్రభుత్వం నుంచి స్పష్టత లేకపోవడంతో తమను ప్రశ్నిస్తున్న రైతులకు ఏం సమాధానం చెప్పాలో కూడా అధికారులకు అర్థం కావడం లేదు. రూ.2 లక్షల వరకు మాఫీ వర్తిస్తుందని ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఆపై ఉన్న పంట రుణాలపై ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో రూ.2 లక్షలకన్నా ఎక్కువ లోన్ తీసుకున్న రైతుల్లో ఆందోళన నెలకొంది.

మోమిన్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీపై అన్నదాతల్లో నెలకొన్న సందేహాలు పూర్తి స్థాయిలో నివృత్తి కావడం లేదు. ఆగస్టు 15 లోపు కుటుంబానికి రూ.2 లక్షల వరకు రుణమాఫీ అమలు చేస్తామన్న ప్రభుత్వ హామీలో లబ్ధి పొందని రైతుల ఇంటింటికి అధికారులు సర్వే చేస్తున్నారు. ఆధార్ కార్డులలో పేరు తప్పిదాలు, రేషన్ కార్డులో పేరు లేకపోవడం, కుటుంబంలో రెండు అంతకు మించి ఖాతాలుండటంతో కొంత మందికి మాఫీ కాలేదు. కేవలం మోమిన్‌పేటలోని డీసీసీబీ బ్యాంకులో 28శాతం మంది రైతులకు మాత్రమే మాఫీ కావడంతో అనుమానాలకు తావిస్తుంది. మాఫీ కాని వారి ఇంటింటికి వెళ్లి సర్వే చేసి ప్రతీ రైతుకు వర్తింపజేస్తామని ప్రభుత్వం ప్రకటించినా, స్పష్టమైన హామీ మాత్రం ఇవ్వలేదు. ఇందుకు సంబంధించిన విధివిధానాలను ఖరారు చేయలేదు.

70శాతం రైతులకు అధిక రుణాలు

వ్యవసాయాధికారులు ఇంటింటి సర్వేలో చేస్తున్నది.. కేవలం రుణ ఖాతా ఉండి రేషన్ కార్డులో పేరు లేని రైతుల వద్దకు వెళ్లి ప్రత్యేక యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. రూ.2 లక్షలకు వరకు ఉన్న రుణాన్ని అన్నదాతల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. రూ.రెండు లక్షలకు పైబడిన రుణం పట్ల ప్రభుత్వం ఎలాంటి ఆదేశాలు ఇవ్వనప్పటికీ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలను బట్టి రైతులు ఎక్కువ శాతం వడ్డీలకు తీసుకొచ్చి బ్యాంకులో రుణం చెల్లిస్తున్నారు. అనంతరం బ్యాంక్ స్టేట్‌మెంట్ తీసుకొని వ్యవసాయాధికారుల వద్దకు వెళ్తే ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేవని చెబుతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 70శాతం కుటుంబాల్లో రూ.రెండు లక్షలకు పైబడి రుణ ఖాతాలున్నట్లు సమాచారం. ప్రభుత్వం కుటుంబానికి చేస్తామంటున్న రూ.2లక్షల మాఫీని నేరుగా బ్యాంకు రైతు ఖాతాలో జమ చేయాలని, మిగతా రుణం తామే చెల్లిస్తామని కర్షకులు పేర్కొంటున్నారు. మండల వ్యాప్తంగా దాదాపు నాలుగు వేల మంది రైతులు ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నారు.

రెండు ఖాతాలున్నాయి



నాకు, నా భార్య పేరున రెండు రుణ ఖాతాలున్నాయి. రెండింటిలో రూ.3.90 లక్షల పంట రుణం ఉంది. కుటుంబానికి రూ.2 లక్షల వరకే వర్తిస్తుండంతో మాకు మాఫీ కాలేదు. అధిక వడ్డీకి ఇతరుల వద్ద అప్పు తీసుకొని రూ.1.90లక్షలు బ్యాంకులో రుణం చెల్లించాను. ఇప్పుడు రూ.2లక్షల రుణం మాత్రమే ఉంది. మాఫీ కోసం ఎదురు చూస్తున్నాం.

– సిరాజోద్దీన్, రైతు, ఎన్కేపల్లి

ప్రభుత్వ ఆదేశాలు రాలేదు



కుటుంబానికి రూ.రెండు లక్షలకు పైబడి ఉన్న పంట రుణాలకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. కేవలం రుణం ఉన్న రైతు పేరు రేషన్ కార్డులో లేకుంటే ప్రత్యేక యాప్‌లో ఇంటింటికి తిరిగి నమోదు చేస్తున్నాం. ఎక్కువ మొత్తంలో రుణాలు ఉన్న రైతుల కోసం ఉన్నతాధికారులకు నివేదించాం.

– జయశంకర్, ఏఓ, మోమిన్‌పేట

మహిళా కండక్టర్‌పై యువకుడి దాడి

ధారూరు: విధుల్లో ఉన్న ఆర్టీసీ కండక్టర్‌పై ఓ యువకుడు దాడి చేసిన సంఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్ వివరాల ప్రకారం.. స్టేషన్‌ధారూరుకు చెందిన బాలు సోమవారం సాయంత్రం వికారాబాద్‌లో ఆర్డినరీ బస్సు ఎక్కి తాండూరుకు టికెట్ తీసుకున్నాడు. ధారూరుకు రాగానే బస్సు దిగుతూ రూ.వంద ఇచ్చాను చిల్లర డబ్బులు ఇవ్వాలని కండక్టర్ సునీతను కోరాడు. తాండూరు వెళ్లాక ఇస్తానని ఆమె పేర్కొంది. ధారూరులోనే దిగిపోతానని డబ్బుల కోసం పట్టుబట్టిన యువకుడు కోపోద్రిక్తుడై కండక్టర్‌ను కొట్టి బస్సు దిగి వెళ్లిపోయాడు. వెంటనే కండక్టర్ వికారాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ అరుణను రప్పించి ధారూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పార్ట్ టైం టీచర్ల భర్తీకి డెమో

అనంతగిరి: జిల్లాలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్లో ఖాళీగా ఉన్న టీజీటీ, పీజీటీ, జేఎల్, డీఎల్ పోస్టులకు పార్ట్ టైం ప్రాతిపదికన పని చేయుటకు ఈ నెల 16న వికారాబాద్‌లోని కొత్తగడి రెసిడెన్షియల్ స్కూల్‌లో డెమో తరగతులు నిర్వహిస్తున్న జిల్లా డీసీఓ సాయిలతా మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల వారు సంబంధిత ధ్రువపత్రాలతో ఉదయం 9 గంటలకు హాజరు కావాలని తెలిపారు.

మదర్సా నిర్మాణాన్ని అడ్డుకున్న అధికారులు



నిర్మాణ పనులు అడ్డుకుంటున్న ఇరిగేషన్ ఏఈఈ

పెద్దేముల్: కోట్‌పల్లి ప్రాజెక్టు కాలువ(కెనాల్) స్థలాలను ఆక్రమించుకుని నిర్మిస్తున్న కట్టడాన్ని ఇరిగేషన్ అధికారులు అడ్డుకున్నారు. మంగళవారం మండలంలోని మంబాపూర్ వద్ద కాలువ స్థలాల్లో మదర్సా నిర్మాణం చేపట్టారు. ఈ విషయమై ఇరిగేషన్ అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఏఈఈ మాధురిలత గ్రామాన్ని సందర్శించారు. మదర్సా నిర్మాణ పనులను పరిశీలించారు. ఇరిగేషన్ అధికారులు సర్వే చేసి కోటపల్లి ప్రాజెక్టు సంబంధించిన కెనాల్ స్థలంలో నిర్మాణం ఉందని గుర్తించారు. వెంటనే పనులు నిలిపి వేయాలని హెచ్చరించారు. ఇరిగేషన్ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేస్తే చర్యలు తప్పవని అధికారులు పేర్కొన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి వెళ్తామని తెలిపారు. అంతేగాకుండా నిర్మాణం పనులకు సంబంధించిన పత్రాలు పంచాయతీ నుంచి ఏమి లేవని పంచాయతి కార్యదర్శి సంజీవ్ తెలియజేశారు. అనుమతుల విషయమై నిర్మాణ దారులను వివరణ కోరగా.. తమ వద్ద అన్ని పత్రాలున్నాయని చెప్పారని, నిర్మాణానికి సంబంధించిన పత్రాలు ఉంటే వికారాబాద్ కార్యాలయంకు వచ్చి పత్రాలు చూయించాలని ఇరిగేషన్ ఏఈఈ సూచించారు.

కోడలు కాపురానికి రావడం లేదని అత్త ఆత్మహత్య



మణెమ్మ (ఫైల్)

శంకర్‌పల్లి: కోడలు కాపురానికి రావడం లేదని మనస్తాపానికి గురైన ఓ అత్త బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మోకిల పీఎస్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని టంగటూర్‌కు చెందిన మణెమ్మ(45), మల్లేశం దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరి కొడుకు ఉమాకాంత్‌కు నాలుగేళ్ల క్రితం ఇదే మండలం ప్రొద్దటూర్ గ్రామానికి చెందిన లావణ్యతో వివాహం జరిపించారు. మూడున్నరేళ్ల వరకు బాగానే ఉన్న లావణ్య ఆరు నెలల క్రితం భర్తతో గొడవపడి పుట్టింటికి వెళ్లిపోయింది. కోడలిని తెచ్చేందుకు అత్తామామలు ఎంతగా ప్రయత్నించినా ఫలితం కనిపించలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన మణెమ్మ మంగళవా రం ఇంట్లో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఈ మేరకు కేసు నమోదు చేసు కుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పండగలను ప్రశాంతంగా నిర్వహించాలి



గణేశ్ మండపంలో డీసీపీ రాజేశ్, పోలీసులు

శంషాబాద్ డీసీపీ రాజేశ్

షాద్‌నగర్‌రూరల్: ప్రజలందరూ ఐక్యంగా ఉండి పండగలను శాంతియుతంగా జరుపుకోవాలని శంషాబాద్ డీసీపీ రాజేశ్ సూచించారు. మిలాద్–ఉన్–నబీ, వినాయక నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలో ఏసీపీ కార్యాలయంలో డివిజన్ పోలీసులతో డీసీపీ మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందూ, ముస్లింలు భిన్నత్వంలో ఏకత్వంగా ఉంటూ పండుగలను నిర్వహించాలన్నారు. మిలాద్–ఉన్–నబీ, వినాయక నిమజ్జనోత్సవాలకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు చేపడుతున్నట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. గణేశ్ మండపాల వద్ద ప్రత్యేక నిఘాను ఉంచినట్లు పేర్కొన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలన్నారు. చెరువుల వద్ద ప్రత్యేక విద్యుత్ దీపాలను అలంకరించడంతో పాటు, క్రేన్‌లను అధికారులు అందుబాటులో ఉంచారన్నారు. మండపాల నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకొని గణేశ్ నిమజ్జనం జరుపుకోవాలన్నారు. అనంతరం రాంమందిర్‌లోని గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బొబ్బిలి చెరువు వద్ద వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ రాంకుమార్, ఏసీపీ రంగస్వామి, పట్టణ సీఐ విజయ్‌కుమార్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ చైర్మన్‌కు సన్మానం



విష్ణువర్ధన్‌రెడ్డిను సన్మానిస్తున్న జయకృష్ణ

బొంరాస్‌పేట: ఉమ్మడి నారాయణపేట డివిజన్ డీసీసీబీ చైర్మన్‌గా ఎన్నికైన విష్ణువర్ధన్‌రెడ్డిని మంగళవారం మండల పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ సన్మానించారు. రైతులకు ప్రాథమిక వ్యవసాయ సంఘం ఆధ్వర్యంలో మెరుగైన సేవలు అందుతాయని జయకృష్ణ అన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థులకు గాయాలు

పరిగి: ఎదురుగా వస్తున్న బైక్‌ను కారు ఢీకొనడంతో ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని గడిసింగాపూర్ గ్రామ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బొంరాస్‌పేట్ మండలం బురాన్‌పూర్ తండాకు చెందిన అనిల్, శ్రీనివాస్‌లు పరిగిలో ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతున్నారు. కళాశాల ముగిశాక పరిగి నుంచి ఇంటికి బైక్‌పై వెళ్తుండగా మార్గ మధ్యలో గడిసింగాపూర్ గ్రామ సమీపంలో కొడంగల్ వైపు నుంచి పరిగికి వస్తున్న కారు ఎదురుగా ఢీకొంది. దీంతో బైక్‌పై ఉన్న అనిల్, శ్రీనివాస్‌లకు తీవ్ర గాయాలు కాగా వారిని చికిత్స నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.


సంపులో పడి బాలుడి మృతి



అభిరాం (ఫైల్)

తలకొండపల్లి: అల్లారు ముద్దుగా చూసుకుని తమ కుమారుడిని నీటి సంపు బలి తీసుకోవడంతో ఆ తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. ఈ హృదయ విదారక సంఘటన మండల పరిధిలోని చౌదర్‌పల్లిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. చౌదర్‌పల్లికి చెందిన దుద్దు శేఖర్‌కు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సోమవారం సాయంత్రం ఆయన చిన్న కుమారుడు అభిరాం(2) చెల్లితో కలిసి ఆడుకుంటున్నాడు. కొద్ది సేపటికే బాలిక ఏడ్చుకుంటూ ఇంట్లోకి వచ్చింది. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు అభిరాం జాడ కోసం వెతికారు. ఎక్కడా బాలుడి ఆచూకీ లభ్యం కాలేదు. చివరికి ఇంటి ముందు ఉండే సంపులో చూడగా అభిరాం అందులో పడి ఉన్నాడు. వెంటనే స్థానికంగా ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యానికి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ అభిరాం మృతి చెందాడు. శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భారతీయ కిసాన్ సంఘ్ కార్యవర్గం నియామకం



నూతన జిల్లా కార్యవర్గంతో నాయకులు

మొయినాబాద్: రైతుల సమస్యలపై నిరంతరం భారతీయ కిసాన్ సంఘ్ పోరాడుతుందని సంఘం జిల్లా అధ్యక్షుడు సామ మాధవరెడ్డి అన్నారు. మండలంలో మంగళవారం భారతీయ కిసాన్ సంఘం జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సమా వేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా నూతన అధ్యక్షుడిగా సామ మాధవరెడ్డి, ఉపాధ్యక్షుడిగా విద్యాసాగర్, విష్ణువర్ధన్‌రెడ్డి, కార్యదర్శిగా నోముల గోవర్ధన్‌రెడ్డి, సహ కార్యదర్శులుగా సత్యనారాయణరెడ్డి, జి.రవీందర్‌రెడ్డి, కోశాధికారి పెంటారెడ్డి, ప్రముఖులు జంగయ్య, కృష్ణగౌడ్, రాంచంద్రయ్య, శంకర్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు పాండు, సుధాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, కృష్ణా, రాజశేఖర్ రెడ్డి, దేవేందర్‌రెడ్డి, పశుపోషణ శ్రీనివాస్‌రెడ్డి, హరికృష్ణారెడ్డిలను నియమించారు. ఈ సందర్భంగా వారు రైతుల సమస్యలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మండలాల వారీగా ఉన్న కమిటీలతో సమన్వయంగా ఉంటూ సమస్యలను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు, సంఘం సభ్యులు ఉన్నారు.

'రేషన్' దందా గుట్టు రట్టు

- 38.3 టన్నుల బియ్యం, 11.25 టన్నుల గోధుమలు స్వాధీనం
- ముందస్తు సమాచారంతో అధికారుల దాడులు

శంకర్‌పల్లి: రేషన్ బియ్యం, గోధుమలను తక్కువ ధరలకు సేకరించి అధిక లాభానికి విక్రయిస్తున్న ముఠా గుట్టును రాష్ట్ర విజిలెన్స్, పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం రట్టు చేశారు. అనంతరం మోకిల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మిర్జాగూడ అనుబంధ గ్రామమైన ఇంద్రారెడ్డినగర్‌లో హైదరాబాద్‌కి చెందిన మహమ్మద్ ఇబ్రహీం అనే వ్యక్తి కొన్నేళ్లుగా రేషన్ బియ్యం అక్రమ దందా చేస్తున్నాడు. గ్రామాల్లో, రేషన్ డీలర్ల వద్ద తీసుకున్న రేషన్, గోధుమలను ఇంద్రారెడ్డినగర్‌లోని ఓ పశువుల షెడ్డులో నిల్వ ఉంచాడు. అనంతరం ఎక్కువ ధరకు మహారాష్ట్ర, బిహార్ రాష్ట్రాలకు వాటిని తరలిస్తుంటాడు. ఈ క్రమంలో మంగళవారం పక్కా సమాచారంతో రాష్ట్ర విజిలెన్స్, పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. ఇంద్రారెడ్డినగర్‌లో నిల్వ ఉంచిన 38.3 టన్నుల రేషన్ బియ్యం, 11.25 టన్నుల గోధుమలను పట్టుకున్నారు. ఆ సమయంలో ఇబ్రహీం అక్కడ లేకపోవడంతో.. ఉన్న కూలీలను అదుపులోకి తీసుకున్నారు. పట్టుకున్న సరుకులను చేవెళ్లలోని ప్రభుత్వ గోదాంకి తరలించి, మోకిల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ దాడుల్లో రాష్ట్ర విజిలెన్స్, పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శశిధర్ రాజు, అంజయ్య, రఘునందన్, రవీందర్‌నాయక్ తదితరులు ఉన్నారు.

పీడీయాక్టు నమోదు చేస్తాం

ఎవరైనా రేషన్ బియ్యాన్ని అక్రమంగా అమ్మినా, తరలించిన వారిపై పీడీయాక్టు కింద కేసు నమోదు చేస్తామని పౌర సరఫరాల ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రఘునందన్ హెచ్చరించారు. ఇప్పటినుంచి నిరంతరం దాడులు కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు. అక్రమ దందా ఎవరు చేసినా ఉపేక్షించేది లేదన్నారు.



పట్టుబడిన రేషన్ బియ్యం, గోధుమల బస్తాలతో అధికారులు

యువకుడి అదృశ్యం

పహాడీషరీఫ్: తండ్రి మందలించడంతో కొడుకు ఇంటి నుంచి వెళ్లిపోయిన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హర్యానా రాష్ట్రానికి చెందిన మక్సూద్ ఖాన్ కుటుంబం పదేళ్ల క్రితం జీవనోపాధి నిమిత్తం పహాడీషరీఫ్‌కు వలస వచ్చి నివాసం ఉంటుంది. కాగా ఇతని చిన్న కుమారుడు మహ్మద్ ఇక్రం జేసీబీ డ్రైవింగ్‌కు వెళ్లకపోవడంతో మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన ఇక్రం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఎంతకి తిరిగి రాకపోవడంతో అతని ఆచూకీ కోసం సాధ్యమైన అన్ని ప్రాంతాలలో వెతికినా లభ్యం కాలేదు. ఈ విషయమై మక్సూద్‌ఖాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో గాని 87126 62367 నంబర్‌లో సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

సూటిపోటి మాటలతో ఎగతాళి చేస్తున్నారని..



పరిగిలో రోడ్డెక్కి ధర్నా చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

- పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడిన మహిళ
- నగరంలో చికిత్స పొందుతూ మృతి
- అనంతరెడ్డిపల్లిలో విషాదం

దోమ: తనను జైలు పాలు చేయడంతో పాటు సూటిపోటి మాటలతో ఎగతాళి చేస్తున్నారని మనస్తాపానికి గురైన ఓ మహిళ పురుగుల మందు తాగి, చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ ఘటన దోమ పీఎస్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ ఆనంద్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. దిర్సంపల్లి అనుబంధ గ్రామమైన అనంతరెడ్డిపల్లికి చెందిన భరతసింహారెడ్డికి భార్య సుశీల(27), కుమారుడు చరణ్ తేజ్‌రెడ్డి(6) కూతురు శ్రేష్ట(5) ఉన్నారు. అయితే ఇదే గ్రామానికి చెందిన మధుసూదన్‌రెడ్డి కూతురు (మైనర్) ఇంట్లో నుంచి పారిపోయింది. ఈ విషయమై మధుసూదన్‌రెడ్డి ఫిర్యాదుతో అప్పట్లో కేసు నమోదైంది. ఈ అంశం కోర్టు వరకూ వెళ్లింది. తను పారిపోయేందుకు సుశీలనే సహకరించిందని బాలిక కోర్టులో చెప్పడంతో న్యాయస్థానం ఆమెకు జైలు శిక్ష విధించింది. కొన్ని రోజులు పాటు జైలులో ఉన్న సుశీల ఇటీవలే విడుదలై ఇంటికి వచ్చి, యథావిధిగా తన పనులు చేసుకుంటోంది. అయితే పొలానికి వెళ్తున్న సమయంలో మధుసూదన్‌రెడ్డి, అతని భార్య మంజుల, బావమర్ది కొండారెడ్డి తనను చూసి నవ్వడం, పరుష పదజాలంతో తిట్టడంతో సుశీల మనస్తాపానికి గురైంది. ఈ నెల 6న పురుగుల మందు తాగింది. ఇది గమనించి స్థానికులు ఆమె భర్త భరతసింహారెడ్డికి సమాచారం ఇవ్వడంతో 108 వాహనంలో వికారాబాద్‌లోని మిషన్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో 8న హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న సుశీల మంగళవారం మృతిచెందింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పరిగిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కేసును నీరుగారుస్తున్నారు..

దోమ ఎస్‌ఐ ఆనంద్ కుమార్ కేసును నిరుగారుస్తున్నారని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ మేరకు పరిగిలోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట వికారాబాద్–పరిగి రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. ఎస్‌ఐ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. తమ కుటుంబ సభ్యురాలు మృతి చెందిన విషయమై ఫిర్యాదు చేసేందుకు వెళ్తే.. కనీసం పిటిషన్ కూడా తీసుకోలేదని మండిపడ్డారు. విషయం తెలుసుకున్న పరిగి ఎస్‌ఐ సంతోష్ కుమార్ సిబ్బందితో అక్కడకు చేరుకుని ఆందోళనకారులకు సర్ది చెప్పడంతో ధర్నా విరమించారు. ఈ విషయంపై ఎస్‌ఐ ఆనంద్ కుమార్‌ను వివరణ కోరగా.. బాధితుల పిటిషన్‌లో కొట్టివేతలు ఉండటంతో మళ్లీ రాసుకుని తీసుకురావాలని సూచించానని, అయినప్పటికీ కేసు నమోదు చేశామని వివరించారు.

మహారాజులపై విమర్శలు తగవు

- ట్రస్టు భూములు కొన్నవారే తమాషాలు చేయడం విడ్డూరం
- విద్యా వికాస్ సమితి సభ్యుడు రాకేశ్ మహరాజ్ మండిపాటు



మాట్లాడుతున్న విద్యా వికాస్ ట్రస్ట్ సభ్యులు

తాండూరు: మాజీ మంత్రి మాణిక్‌రావు మొదటి భార్య పేరు తెలియని వారు నేడు మహరాజుల కుటుంబ సభ్యులపై విమర్శలు చేస్తున్నారని విద్యా వికాస్ సమితి సభ్యులు రాకేశ్ మహరాజ్, ఉత్తమ్‌చంద్, ధారాసింగ్ మండిపడ్డారు. పట్టణంలోని రమేశ్ మహరాజ్ నివాసంలో మంగళవారం ఏర్పాటు చేశారు. రాకేశ్ మాట్లాడుతూ.. మహరాజుల కుటుంబ సభ్యులు ఏనాడూ కుటుంబ, వ్యక్తిగత విషయాలను బయటకు తీసుకురాలేదన్నారు. కోర్టులో ఉన్న కేసుపై కొందరు వ్యక్తులు ఇష్టానుసారం మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తాండూరులోని డెక్కన్ పాట్రి ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నష్టాలలో ఉండటంతో కోర్టు తీర్పు మేరకు 1972లో వేలం వేశారన్నారు. ఇందుకు సంబంధించిన 33.33 ఎకరాల భూమిని మాణిక్‌రావు వేలంలో దక్కించుకున్నారని తెలిపారు. ఈ సమయంలో మాణిక్‌రావు మొదటి భార్య బతికే ఉన్నారన్నారు. ఆమె పేరు కూడా తెలియని వారంతా ప్రస్తుతం మాణిక్‌రావు రెండో భార్య శశిప్రభతో కలిసి అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. 1992లో మాణిక్‌రావు రెండో వివాహం చేసుకొన్న తర్వాతే కుటుంబంలో గొడవలు మొదలయ్యాయని వివరించారు. ఈక్రమంలో మాణిక్‌రావు మతిస్థిమితం కోల్పోయారని చెప్పి విద్యా వికాస్ ట్రస్టును శశిప్రభ తన పేరుపై మార్చుకున్నారన్నారు. ఆతర్వాత 33 ఎకరాల్లో 16 ప్లాట్లు విక్రయించారని తెలిపారు. ఎన్టీఆర్ కాలనీలోని విద్యావికాస్ ట్రస్టుకు చెందిన ఐదెకరాల భూమిని మున్సిపల్ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి కొనుగోలు చేయడమే కాకుండా, తమాషాలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎమ్మెల్యేలు, మంత్రులుగా కొనసాగిన మహరాజుల ఫ్యామిలీ నుంచి ఏనాడూ దందాలకు పాల్పడలేదన్నారు. 1982లో 33.33 ఎకరాల భూమిని విద్యా వికాస్ సమితి ఏర్పాటు చేసి పీపుల్స్ కళాశాల ఏర్పాటు చేశారన్నారు. సమస్య కోర్టు పరిధిలో ఉన్నందున ఎలాంటి తీర్పు వచ్చినా కట్టుబడి ఉంటామన్నారు.